

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు, కనిష్టం రూ.8 వేలు పలికాయి.



టమాట కిలో రూ.19

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.19, కనిష్టం రూ.10, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.2°/20.0°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



ఆనంద్

అనంతపురం అర్బన్: నూతన కలెక్టర్ ఓ.ఆనంద్ శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. నెల్లూరు నుంచి ఉదయం బయల్దేరి మధ్యాహ్నం అనంతపురం చేరుకుంటారు.

కొత్త కలెక్టర్‌పై ఉద్యోగుల ఆశలు

రెవెన్యూ శాఖలో సీనియర్ అసిస్టెంట్ పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న జూనియర్ అసిస్టెంట్లు కొత్త కలెక్టర్‌పై ఆశలు పెట్టుకున్నారు. రెవెన్యూలో 32 సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించడంలో ఏడాదిన్నరగా గత అధికారులు జాప్యం చేస్తూ వచ్చారు. దీంతో వారు తీవ్ర నిరాశకు గురయ్యారు. కొత్త కలెక్టర్ తమకు పదోన్నతులు కల్పిస్తారన్న ఆశతో ఉన్నారు.

నేటి నుంచి వర్షాలు



అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాకు రాగల ఐదు రోజులు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకర బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షం పడే సూచన ఉందని పేర్కొన్నారు. ఈ నెల 13న 13 మి.మీ, 14న 8 మి.మీ, 15న 14 మి.మీ, 16న 16 మి.మీ, 17న 15 మి.మీ మేర సగటు వర్షపాతం నమోదు కావచ్చని తెలిపారు.

అక్షరమే ఆయుధం

పత్రికా స్వేచ్ఛ.. ప్రజాస్వామ్యానికి గీటురాయి



ఏ దేశంలోనైనా పత్రికా స్వేచ్ఛ ఉందంటే అక్కడ ప్రజాస్వామ్యం ఉందని అర్థం. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగినప్పుడు ఎవరైనా మాట్లాడాలంటే భయపడుతున్నారు. అధికారంలో ఉన్న వాళ్లు ఆ స్థాయిలో భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఏదో స్టేట్‌మెంట్ ప్రచురించారని కేసులు పెట్టడం దారుణం. ప్రజాస్వామ్యవాదులు పత్రికా సంకెళ్లు, అక్రమ కేసులను ఖండించాలి. ప్రభుత్వ దమననీతిపై ప్రశ్నించాలి. ప్రజాస్వామ్యం కోసం పత్రికా స్వేచ్ఛను కాపాడాలి.

– డాక్టర్ తలారి రంగయ్య, మాజీ ఎంపీ, అనంతపురం



విష సంస్కృతికి తెర



ప్రజాస్వామ్యంలో మీడియా అనేది నాల్గో స్తంభం లాంటిది. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా ఉంటుంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపే బాధ్యత మీడియాపై ఉంటుంది. అలాంటి మీడియాపై రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించే విష సంస్కృతికి తెర తీసింది. పత్రికా స్వేచ్ఛను హరించడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. కేసులు నమోదు చేసే కొత్త సంప్రదాయం సరికాదు. మేధావులు, ప్రజా సంఘాలు ఖండించాలి.

– గోరంట్ల మాధవ్, మాజీ ఎంపీ, హిందూపురం

టమాట మండీల్లో.. గూండా ట్యాక్స్

టమాట మండీల్లో 'గూండా ట్యాక్స్' నడుస్తోంది. పైసా పెట్టుబడి లేకుండా, ఎలాంటి కాయాకష్టం లేకుండా రోజూ రూ.3 లక్షలు వసూలు చేస్తున్నారు. అంటే నెలకు అక్షరాలా 90 లక్షల రూపాయలు అన్నమాట. ఇదీ అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి టమాట మండీల్లో అధికార పార్టీ నేతలు సాగిస్తున్న నయా దందా.



కక్కలపల్లి మండీలో లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న టమాట

రోజూ రూ. 3 లక్షల వసూలు

- కూటమి ప్రభుత్వం వచ్చాక బరితెగింపు
- 'పరిటాల' పేరుతో ట్రాన్స్‌పోర్ట్ యజమాని, మండీ యజమాని వసూళ్లు
- పెద్దలారీకి రూ.2 వేలు, చిన్నలారీ రూ.1,000, ఐచర్‌కు రూ.500 కప్పం కట్టాల్సిందే



TOMATO LORRY LOADING RECEIPT
No. 2859 Date 3/9/25
Lorry No. AP 39 UD 4949
Party Name
Lorry Broker Name
Loading Point
2000/-
Signature

'టమాట లారీ లోడింగ్ రిసీఫ్ట్' పేరుతో ఇచ్చిన రూ. 2 వేలు రశీదు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆరుగాలం కష్టపడి పండించిన టమాటకు గిట్టుబాటు ధర లేక రైతులు అలమటిస్తుంటే.. వారి కష్టాన్ని రాప్తాడు నియోజకవర్గానికి చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధి కుటుంబం దోపిడీ చేస్తోంది. గతంలో కక్కలపల్లి టమాట మండీలకు వచ్చే వాహనాల నుంచి పంచాయతీ అధికారులు సుంకం వసూలు చేశారు. ఈ క్రమంలో ఏడాదికి రూ.70 లక్షలకు పైగా ఆదాయం చేకూరేది. దీనిపై కొందరు మండీ యజమానులు అప్పట్లో హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు సుంకం వసూళ్లు ఆపేశారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత..

సాధారణంగా ఏడాదిలో ఆర్నెళ్ల పాటు టమాట సీజన్ ఉంటుంది. ఇక్కడి నుంచి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. బయ్యర్లు (కొనుగోలుదారులు) ఆయా ప్రాంతాల నుంచి వస్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అధికార పార్టీకి చెందిన ఓ యువ నాయకుడు రంగంలోకి దిగాడు. టమాట మండీలకు వచ్చే ప్రతి వాహనం 'కప్పం కట్టాల్సిందే'నంటూ హుకుం జారీ చేశాడు. ఈ క్రమంలో కొందరు ట్రాన్స్‌పోర్ట్ యజమానులు, మండీ వ్యాపారులు రంగంలోకి దిగి 'పనులు' చక్కబెట్టారు. గతేడాది జూలైలో 'గూండా ట్యాక్స్' మొదలైంది.

వాహనాన్ని బట్టి రేటు

వాహనాలను బట్టి 'గూండా ట్యాక్స్' నిర్ణయించారు. పెద్ద లారీకి రూ.2వేలు, ఐచర్ (పెద్దది) రూ. 1000, చిన్నది రూ. 500 ఫిక్స్ చేశారు.ఎన్ని వాహనాలు వచ్చాయో లెక్క సాయంత్రానికి వసూళ్లు చేస్తారు. గత సీజన్‌లో దాదాపు రూ.7 కోట్లకు పైగా వసూళ్లు చేశారు. ఈ అక్రమ వసూళ్లను బయ్యర్లు తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. ఈ క్రమంలో టమాట కొనుగోలుకు కూడా ముందుకు రాలేదు. దీంతో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేశారు. రెండు రోజులపాటు జరిగిన ఆందోళన రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోకపోవడంతో 'గూండా ట్యాక్స్' నిరాటంకంగా సాగుతోంది.

సోషల్ మీడియాలో వైరల్

టమాట మండీల్లో సాగుతున్న వసూళ్ల దందాపై కొందరు సోషల్ మీడియా వేదికగా పెట్టిన మెసేజ్‌లు వైరల్‌గా మారాయి. 'తరిగోపుల రవి, పేపర్ శీనా, సుభాష్ చంద్రబోస్ తదితరులు పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ పేర్లు చెబుతూ పెద్ద బండి(లారీ)కి రూ. 2 వేలు, ఐచర్ పెద్దది రూ.1000, చిన్న వాహనానికి రూ.500 వసూళ్లు చేస్తున్నారు. వీరిని కలెక్షన్ల కోసమే నియమించారా? గవర్నమెంట్ మాది అంటున్నారు. వచ్చే మూడేళ్లు ఇదేవిధంగా వసూళ్లు చేస్తామంటున్నారు. మీ సామాజిక వర్గం ఓట్లు వేస్తేనే గెలిచారా? ఇదేమి దౌర్జన్యం' అంటూ పెట్టిన మెసేజ్ వైరల్‌గా మారింది.

'మాకు సంబంధం లేదు'

టమాట మండీల్లో వసూలు చేస్తున్న 'ట్యాక్స్'లపై పంచాయతీ అధికారులను ప్రశ్నించగా తమకు ఏమాత్రమూ సంబంధం లేదని స్పష్టం చేశారు. రెండేళ్ల కిందట వరకు పంచాయతీనే వసూలు చేసేదని... అయితే హైకోర్టు ఆదేశాలతో వసూళ్లు ఆపేశామని చెబుతున్నారు.

మళ్లీ మొదలైన దందా..



TOMATO MINI LORRY LOADING RECEIPT
No. 1616
Eicher No.
Party Name
Eicher Broker Name
Loading Point
Rs. 500/-
Signature

'టమాట మినీ లారీ లోడింగ్ రిసీఫ్ట్' పేరుతో ఇచ్చిన రూ.500 రశీదు

ఈ ఏడాది సీజన్ మొదలు కావడంతో 'గూండా ట్యాక్స్ 2.0' మొదలైంది. ఓ ట్రాన్స్‌పోర్ట్ యజమాని, ఓ మండీ యజమాని రంగంలోకి దిగారు. వీరి ఆధ్వర్యంలోనే వసూళ్లు చేస్తున్నారు. రోజూ సగటున 190 దాకా వాహనాలు లోడింగ్ అవుతున్నాయి. అంటే రోజూ ఆదాయం రూ. 3 లక్షలకు పైమాటే. పరిటాల కుటుంబం పేరు చెప్పుకుంటూ యథేచ్ఛగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇందుకోసం కొందరిని ప్రత్యేకంగా నియమించుకున్నారు. ఉదయం ఏ మండీకి ఏయే వాహనాలు వచ్చాయో స్లిప్పులు రాసుకుని సాయంత్రం ఆయా మండీల యజమానులకు చెబుతారు. స్లిప్పుల్లో లెక్కల ప్రకారం ఎన్ని వాహనాలు వెళ్లి ఉంటే అంత డబ్బు చెల్లించాలి. ఇదంతా బయ్యర్ల నుంచి వసూలు చేస్తున్నా...వారు రైతులపై మోపుతారని వాపోతున్నారు. 'టమాట మండీమే అప్‌సే ఏక్ గాడీకు దో హజార్ గూండా ట్యాక్స్ బర్‌నా' అంటూ మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన బయ్యర్లు చర్చించుకుంటున్నారు. కాగా 'టమాట లారీ లోడింగ్ రిసీఫ్ట్, 'టమాట మినీ లారీ లోడింగ్ రిసీఫ్ట్' పేరుతో రశీదులు ఇస్తుండడం చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఎవరి కోసం, ఎందుకోసం వసూళ్లు చేస్తున్నారో అన్న వివరాలు లేకపోవడంతో మండిపడుతున్నారు.

యూరియా లారీలను అడ్డుకున్న రైతులు



ఉప్పరహాళ్‌లో ఆపేసిన యూరియా బస్తాల లారీలు

బొమ్మనహాళ్: తమ గ్రామానికి యూరియా సరఫరా కావడం లేదంటూ శుక్రవారం రాత్రి ఉప్పరహాళ్‌కు చెందిన రైతులు ఆందోళనకు దిగారు. శ్రీధరఘట్ట సొసైటీకి యూరియాను తరలిస్తున్న లారీలను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి చెందిన రైతులకు ఒక్క బస్తా యూరియా కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలు... శుక్రవారం శ్రీధరఘట్ట సొసైటీకి ఒక లారీ, సింగానహళ్లి గ్రామంలో ఓ ప్రైవేట్ డీలర్‌కు మరో లారీలో యూరియ బస్తాలు తరలిస్తున్న విషయం తెలుసుకున్న ఉప్పరహాళ్ గ్రామ రైతుల్లో ఆగ్రహం పెల్లుబుకింది. దీంతో రెండు లారీలను గ్రామంలో అడ్డుకున్నారు. శనివారం ఉదయం గ్రామంలో యూరియాను గ్రామంలోని రైతులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో సమాచారం అందుకున్న బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్, సిబ్బందితో కలసి ఉప్పరహాళ్ గ్రామానికి చేరుకుని రైతులతో చర్చించారు. తమ గ్రామానికి చెందిన రైతులకు ఇప్పటి వరకూ ఒక్క బస్తా యూరియా కూడా ఇవ్వలేదని, తాము పంటలు సాగు చేయడం లేదా అని ప్రశ్నించారు. రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లితే శ్రీధరఘట్ట గ్రామానికి చెందిన రైతులకు మాత్రమే ఇచ్చారన్నారు. ఈ లారీల్లో ఉండే యూరియా బస్తాలను ఇక్కడే ఇవ్వాలని అని డిమాండ్ చేశారు. దీంతో వ్యవసాయ, రెవెన్యూ, సొసైటీ అధికారులతో ఎస్ఐ నబీరసూల్ మాట్లాడి ఉప్పరహాళ్ గ్రామానికి ఒక లారీ యూరియా కేటాయిస్తూ ఇక్కడే పంపిణీ చేయాలని సూచించారు. ఈ లారీలు ఇక్కడి నుంచి శ్రీధరఘట్ట సొసైటీకి వెళ్లాలంటే ఉప్పరహాళ్ రైతులకు హామీ ఇస్తేనే లారీలను పంపిస్తారని, లేకపోతే పరిస్థితి చెయ్యి దాటుతుందని హెచ్చరించారు. దీంతో ఉప్పరహాళ్ గ్రామానికి ప్రత్యేకంగా లారీ యూరియా పంపిణీ చేస్తామని అధికారులు హామీనివ్వడంతో రైతులు శాంతించారు.

రేపు ఎన్‌డీఏ, సీడీఎస్ పరీక్షలు

- 252 మంది అభ్యర్థులకు రెండు పరీక్ష కేంద్రాలు
- ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని డీఆర్‌ఓ ఆదేశం



మాట్లాడుతున్న డీఆర్‌ఓ మలోల

అనంతపురం అర్బన్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈ నెల 14న నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ (ఎన్‌డీఏ), కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ (సీడీఎస్) పరీక్షలు జరగనున్నాయని డీఆర్‌ఓ మలోల తెలిపారు. రెండు కేంద్రాల్లో జరగనున్న పరీక్షలకు 252 మంది అభ్యర్థులు హాజరవుతారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణపై డీఆర్‌ఓ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో యూపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ ముఖేష్ దత్ మీనాతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూపీఎస్సీ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జేఎన్‌టీయూ(ఏ) కేంద్రంలో కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ (సీడీఎస్) పరీక్ష మూడు సెషన్లుగా ఉదయం 9 నుంచి ఉదయం 11 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 12.30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు పేపర్–2, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పేపర్–3 జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు 119 మంది హాజరవుతారని వెల్లడించారు. అనంతపురంలోని కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కేంద్రంలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ పరీక్ష రెండు సెషన్లుగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం12.30 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పేపర్–2 పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షలకు 133 మంది హాజరవుతారని తెలిపారు. కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. జేఎన్‌టీయూఏ కేంద్రానికి ఇన్‌స్పెక్టింగ్ అధికారిగా ఎస్‌డీసీ తిప్పేనాయక్, రూట్ అధికారిగా ఎస్‌డీసీ రామ్మోహన్, కేఎస్ఎన్ డిగ్రీ కళాశాల కేంద్రానికి ఎస్‌డీసీ మల్లికార్జునుడు, రూట్ అధికారిగా మల్లికార్జునరెడ్డిని నియమించామని వెల్లడించారు. పరీక్ష సమయానికి గంట ముందే అభ్యర్థులు కేంద్రానికి చేరుకోవాలని డీఆర్‌ఓ సూచించారు.

చిన్నారిని బలిగొన్న బాటిల్ మూత



మృతిచెందిన రక్షత్‌రామ్

గుత్తి రూరల్: వాటర్ బాటిల్ మూత గొంతులో ఇరుక్కుని రక్షత్‌రామ్ (18 నెలలు) అనే చిన్నారి మృతి చెందాడు. ఈ ఘటన గుత్తి మండలం వన్నేదొడ్డి గ్రామ శివారులోని పవర్‌గ్రిడ్ కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం నగరానికి చెందిన మౌనిక పవర్‌గ్రిడ్ కేంద్రంలో ఏపీ ట్రాన్స్‌కో ఏడీఈగా విధులు నిర్వర్తిస్తున్నారు. శుక్రవారం రాత్రి నైట్ షిఫ్ట్ డ్యూటీకి కుమారుడు రక్షత్‌రామ్‌ను తీసుకుని వెళ్లారు. కుమారుడు ఆడుకోవడానికి వాటర్ బాటిల్ ఇచ్చి విధుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో బాటిల్ మూత తీసి మింగడానికి ప్రయత్నించడంతో గొంతులో ఇరుక్కుని తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన ఏడీఈ, పవర్‌గ్రిడ్ ఉద్యోగులు వెంటనే చిన్నారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుమారుడి మృతితో తల్లి మౌనిక కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వైఎస్సార్‌సీపీ నేత తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృతి

- తోటలో పనులు చేయిస్తుండగా గుండెపోటు
- పలువురు నాయకుల దిగ్భ్రాంతి..
- రేపు అనంతపురం నుంచి తోపుదుర్తి వరకు అంతిమయాత్ర



భాస్కర్‌రెడ్డి భౌతికకాయానికి పూల మాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి

ఆత్మకూరు/ అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తోపుదుర్తి భాస్కర్ రెడ్డి (70) శుక్రవారం గుండెపోటుతో మరణించారు. తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి అనంతపురంలో నివాసముంటూ ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామం వద్ద ఉన్న తన పొలంలో కూలీలతో పనులు చేయించేవారు. ఇదే క్రమంలో శుక్రవారం కూడా తన పొలంలో కూలీలతో పనులు చేయిస్తుండగా ఫోన్ రావడంతో కూలీల దగ్గర నుంచి పక్కకు వెళ్లారు. తర్వాత ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో పొలంలో పని చేసే వారు వెళ్లి చూడగా కిందపడి ఉన్నారు. వెంటనే అనంతపురంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు చికిత్స అందించడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆయన మరణించినట్లు ధ్రువీకరించారు. భాస్కర్‌రెడ్డికి కుమారుడు, కుమార్తె సంతానం.

అందరితో సన్నిహితంగా..

తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి 1987లో కాంగ్రెస్ నుంచి ఆత్మకూరు ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత డీసీసీ వైస్ ప్రెసిడెంట్‌గా కూడా పని చేశారు. ఆయన సతీమణి తోపుదుర్తి కవిత 2006లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించాక దంపతులిద్దరూ జగన్ వెంట నడిచారు. రాజకీయాల్లో ఎలాంటి మచ్చ లేకుండా ఉన్న భాస్కర్‌రెడ్డి ప్రతి ఒక్కరితోనూ సన్నిహితంగా ఉండేవారు. అలాంటి వ్యక్తి ఆకస్మిక మరణం అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది.



తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి (ఫైల్)

పలువురి నివాళి

తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మరణ వార్త వినగానే వైఎస్సార్‌సీపీ నాయకులు, శ్రేణులు, అభిమానులు అనంతపురంలోని నివాసం వద్దకు తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీ రంగయ్య, మాజీ ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, వై.విశ్వేశ్వరరెడ్డి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి చందు, తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, తోపుదుర్తి నయనతారెడ్డి, గంగుల భానుమతి, రమేశ్‌గౌడ్, తదితరులు భాస్కర్‌రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. సంతాపం తెలిపిన వారిలో అనంతపురం మేయర్ వసీం, మాజీ మున్సిపల్ చైర్మన్ నూర్ మహమ్మద్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నేత బెస్త రమణ, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వడిత్య గోవిందునాయక్, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌రెడ్డి, తెలుగు వర్సిటీ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ పెదారపు చెన్నారెడ్డి ఉన్నారు.

రేపు అంత్యక్రియలు

అనంతపురం ఎడ్యుకేషన్: తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి అంతిమయాత్ర ఆదివారం ఉదయం 8 గంటలకు అనంతపురంలోని రామచంద్రనగర్ ఇంటి వద్ద నుంచి ప్రారంభమవుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. యాత్ర ఆత్మకూరు మండలం తోపుదుర్తి వరకు సాగుతుందని, అక్కడ ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు జరుగుతాయని వెల్లడించారు.

క్లుప్తంగా

జిల్లాకు 1,130 మెట్రిక్ టన్నుల యూరియా



యూరియా బస్తాలను పరిశీలిస్తున్న ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్

అనంతపురం అగ్రికల్చర్: ఇఫ్కో కంపెనీ నుంచి 1,130 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరిన యూరియా బస్తాలను ఆయన పరిశీలించారు. జేసీ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్‌కు 580 మెట్రిక్ టన్నులు, సొసైటీలకు 220 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్లకు 330 మెట్రిక్ టన్నులు కేటాయించి సరఫరా చేయనున్నట్లు వివరించారు.

జిల్లా స్థాయి సెపక్‌తక్రా జట్ల ఎంపిక




ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

ఉరవకొండ: స్థానిక లయన్స్ క్లబ్ క్రీడా మైదానంలో అండర్–14, 17, 19 జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ బాల, బాలికల సెపక్‌తక్రా జట్ల ఎంపిక శుక్రవారం నిర్వహించారు. జిల్లాకు చెందిన సీనియర్ పీడీలు మారుతీప్రసాద్, నాగరాజు, నాగేంద్ర, రాఘవేంద్ర, కృష్ణ, శివకుమార్, రాయుడు, అనిత, నాగేంద్ర, రాజేష్ పర్యవేక్షించారు. పోటీలను జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వరి, ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ ప్రారంభించారు. ఎంపికైన అండర్ 14 బాలిక జట్టులో భవాని, అమృత, అంజలి, వనిత, ఝాన్సీ, బాలుర జట్టులో అఖిల్, జీవన్, చిదానందసాయి, విష్ణువర్ధన్, వంశి ఉన్నారు. అలాగే అండర్–17 బాలికల జట్టులో చైతన్యకుమారి, సురేఖ, సుస్మిత, సుజాత, నీలిమా, బాలుర జట్టులో రేవంత్ కుమార్, రాజు,చిదానంద, అవినాష్, హర్ష, అండర్–19 బాలిక జట్టులో రమ్య, భాను ప్రియ, శకుంతల, అంజలి, బాలుర జట్టులో షాహిద్, మురళీ, మోహిత్, వంశీ, చంద్రశేఖర్‌నాయక్ చోటు దక్కించుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుత్తి: స్థానిక రాయల్ థియేటర్ ప్రాంతంలో నివాసముంటున్న లక్ష్మన్న(43) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మన్న శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

స్టూడెంట్ నంబర్ -1



దేవాంగం రామకృష్ణ

భుజాన సైకి బ్యాగ్‌ను తగిలించుకుని వడివడిగా క్లాస్ రూం వైపు వెళుతుంటే ఎవరో విద్యార్థి అనుకుంటే పొరబడినట్లే.. అలాగని వయసు బేరీజు వేసుకుని ప్రొఫెసర్ అనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఇంతకూ అతను ఎవరంటారా? పంచాయతీరాజ్ శాఖలో ఇంజినీర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన దేవాంగం రామకృష్ణ. చదవాలనే సంకల్పంతో నిత్య విద్యార్థిగా మారి ఇంగ్లిష్‌లో పీహెచ్‌డీ పొందారు. నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన రామకృష్ణ ప్రస్థానంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

- చదువుకు వయస్సు అడ్డంకి కాదని నిరూపించిన దేవాంగం రామకృష్ణ
- 73 ఏళ్ల వయస్సులో ఇంగ్లిష్‌లో డాక్టరేట్
- డీఈగా ఉద్యోగ విరమణ చేసిన అనంతరం ఎస్కేయూలో ఎంఏ ఇంగ్లిష్
- అదే సబ్జెక్టులో పీహెచ్‌డీ పూర్తి
- శుక్రవారం డాక్టరేట్‌ను ప్రదానం చేసిన వర్సిటీ అధికారులు
- జీవిత లక్ష్యాన్ని సాధించానంటున్న రామకృష్ణ

అనంతపురం: ఉన్నత చదువులు అభ్యసించడానికి వయసు అడ్డంకి కాదని నిరూపించారు పంచాయతీరాజ్ శాఖ విశ్రాంత ఇంజినీర్ దేవాంగం రామకృష్ణ. 73 సంవత్సరాల వయస్సులో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంగ్లిష్ విభాగంలో డాక్టరేట్ పొందారు. ఇంగ్లిష్ విభాగాధిపతి డాక్టర్ వూటికంటి మాధవి పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆఫ్ రేసిసమ్, ఫెమినిజం, అండ్ కల్చరిజమ్ ఇన్ ద వర్క్స్ ఆఫ్ చిమ మంద' అంశంపై పరిశోధనకు గాను శుక్రవారం ఆయనకు ఎస్కేయూ పరీక్షల విభాగం అధికారులు డాక్టరేట్ అందజేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌ను ఆయన ప్రచురించారు.

మారుమూల పల్లె నుంచి..

శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలంలోని కురుమాల గ్రామానికి చెందిన దేవాంగం రామకృష్ణ... అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. 1980లో సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమో పూర్తి చేసి, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత చదువులు అభ్యసించలేక అదే ఏడాది పంచాయతీరాజ్ విభాగంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా చేరారు. విధుల్లో భాగంగా డ్రాఫ్ట్‌మెన్, అసిస్టెంట్ ఇంజినీర్‌గా పదోన్నతి దక్కింది. డీఈఈగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారు.

పీజీ సెట్‌లోనూ మెరుగైన ర్యాంకు

చదవుకోవాలనే ఆసక్తి రామకృష్ణను నిత్య విద్యార్థిగా మార్చేసింది. 2018లో ఎస్కేయూ సెట్‌లో గణనీయమైన ర్యాంకు సాధించి ఇంగ్లిష్ విభాగంలో అడ్మిషన్ పొందారు. 2020లో పీజీ పూర్తి చేశారు. రీసెట్ రాసిన అనంతరం 2022లో పీహెచ్‌డీ అడ్మిషన్ పొందారు. 69 సంవత్సరాల వయస్సులో పీహెచ్‌డీ అడ్మిషన్ పొందడానికి నిబంధనలు అడ్డు తగిలాయి. దీంతో ఇంగ్లిష్ విభాగాధిపతి డాక్టర్ వి. మాధవి చొరవ తీసుకుని ఉన్నతాధికారులతో చర్చించారు. వయస్సు నిబంధనను సడలించి అడ్మిషన్ కల్పించారు. అప్పటి నుంచి రోజూ క్రమం తప్పకుండా విభాగానికి హాజరై అందరినీ అబ్బురపరిచేవారు. వయసులో తన కంటే చిన్నవారిని గౌరవిస్తూ.. ప్రొఫెసర్ల పట్ల వినయవిధేయతలు చాటుకుంటూ స్టూడెంట్ నంబర్ వన్‌గా అందరితో ఆత్మీయంగా పిలిపించుకునేవారు.

మాకు అందరికీ స్ఫూర్తినిచ్చారు



పీజీలో దేవాంగం రామకృష్ణ క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేవారు. పీహెచ్‌డీలో అడ్మిషన్ తీసుకుని ఒక వైపు పరిశోధన చేస్తూనే..మరో వైపు పీజీ (ఇంగ్లిష్) విద్యార్థులకు తరగతులు తీసుకున్నారు. 74 సంవత్సరాల వయస్సులోనూ ఎంతో చురుగ్గా అన్ని అంశాలను అధ్యయనం చేశారు. మా విద్యార్థులకు, అధ్యాపకులందరికీ రామకృష్ణ ఎంతో స్ఫూర్తినిచ్చారు.

– డాక్టర్ వూటికంటి మాధవి, ఇంగ్లిష్ విభాగాధిపతి

ఇది నూతన అధ్యాయం



74 సంవత్సరాల వయస్సులో పీహెచ్‌డీ చేయాలనుకోవడం అభినందనీయం. ఎస్కేయూ పరిధిలో అతి ఎక్కువ వయస్సులో పీహెచ్‌డీ పూర్తి చేసిన వ్యక్తిగా రామకృష్ణ ఖ్యాతి దక్కించుకున్నారు. ఎస్కేయూ చరిత్రలోనే ఇది నూతన అధ్యాయం. చదవాలనే ఆకాంక్ష ఉంటే వయస్సు అడ్డు కాదని నిరూపించిన రామకృష్ణకు అభినందనలు.

– ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు, రెక్టార్, ఎస్కేయూ

ఓటమి.. భవిష్యత్తు గెలుపునకు నాంది

- రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభోత్సవంలో వక్తలు



పోటీలకు ముందు గౌరవ వందనం సమర్పిస్తున్న క్రీడాకారులు

బత్తలపల్లి: ఓటమి భవిష్యత్తు గెలుపునకు నాంది కావాలని, ఆ దిశగా ప్రతి క్రీడాకారుడు శ్రమించాలని వక్తలు పిలుపునిచ్చారు. బత్తలపల్లి మండలం రామాపురంలోని జెడ్పీహెచ్‌ఎస్ మైదానంలో రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల 10వ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు పాటు ఈ పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడారు. అనంతరం జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో తూర్పు గోదావరి జిల్లా జట్టుపై ప్రకాశం జట్టు, విజయనగరం జట్టుపై అనంతపురం జట్టు విజయం సాధించాయి. అలాగే బాలికల విభాగంలో నెల్లూరుపై శ్రీకాకుళం జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్, మౌలిక వసతుల డైరెక్టర్ గోనుగుంట్ల విజయ్‌కుమార్, ధర్మవరం మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ అయ్యప్పనాయుడు, ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు, రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ ప్రెసిడెంట్ విజయశంకర్‌రెడ్డి, చైర్మన్ వెంకట్రావు, జనరల్ సెక్రటరీ బాలాజి, డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ప్రెసిడెంట్ ఈశ్వరయ్య, జనరల్ సెక్రటరీ వెంకటేష్, ఫిజికల్ డైరెక్టర్ తలారి లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు పాలైన నవజాత శిశువు



నవజాత శిశువును చేరదీసిన స్థానికులు

కళ్యాణదుర్గం: పేగు తెంచుకుని పుట్టిన ఆ ఆడ బిడ్డ ఏ తల్లికి భారమైందో ఏమో.. తెలియదు కానీ ప్రపంచంలోకి అడుగు పెట్టిన మరుక్షణమే రోడ్డు పక్కన ముళ్ల పొదల్లోకి చేరింది. శిశువు ఏడుపు విన్న స్థానికులు వెంటనే చేరదీశారు. కళ్యాణదుర్గం పట్టణ సమీపంలోని ధర్మవరం రోడ్డులో ఉన్న గ్యాస్ గోడౌన్ సమీపంలో గురువారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న సీఐ యువరాజ్, మహిళా కానిస్టేబుళ్లు అక్కడకు చేరుకుని ఆరా తీశారు. శిశువును స్థానిక ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. పోలీసుల నుంచి సమాచారం అందుకున్న ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీప్రసన్న, సిబ్బందితో కలిసి శుక్రవారం ఉదయం ఆర్డీటీ ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న నవజాత శిశువు ఆరోగ్యంపై స్థానిక వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

'తమ్ముళ్ల' మధ్య చిచ్చు రేపిన సీఎం సభ

- పరస్పర ఛాలెంజ్‌లతో కూడలిలో గొడవ
- ఉద్రిక్తతల నడుమ పీఎస్‌కు చేరిన పంచాయితీ



గుత్తిలో ఘర్షణ పడుతున్న తెలుగు తమ్ముళ్లు

గుత్తి: ఈ నెల 10న అనంతపురంలో సీఎం చంద్రబాబు నిర్వహించిన సభ గుత్తిలో టీడీపీ నేతల వర్గపోరుకు ఆజ్యం పోసింది. దమ్ముంటే రారా చూసుకుందామంటూ ఒకరికొకరు సవాళ్లు విసురుకుని ప్రధాన రహదారిపైకి చేరుకుని గొడవకు దిగడంతో పరిస్థితి ఒక్కసారిగా చేజారింది. ఉద్రిక్తతల నడుమ ఇరువర్గాలు చివరకు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పంచాయితీకి సిద్ధమయ్యాయి. వివరాల్లోకి వెళితే.. గుత్తి పట్టణ టీడీపీ కన్వీనర్ ఎంకే చౌదరి, అదే పార్టీ నాయకుడిగా చెలామణి అవుతున్న జీఆర్పీ కానిస్టేబుల్ వాసు మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతూ ఉన్నాయి. ఈ క్రమంలో ఈ నెల 10న సీఎం చంద్రబాబు సభకు జనాలను తరలించాలంటూ 24వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ శ్రీనాథ్‌కు ఎంకే చౌదరి మూడు బస్సులు కేటాయించాడు. అయితే జనాలు ఉత్సాహం చూపకపోవడంతో బస్సులు ఫుల్ కాలేదు. ఈ క్రమంలో శుక్రవారం శ్రీనాథ్‌కు ఎంకే చౌదరిఫోన్ చేసి బస్సులు ఎందుకు ఫుల్ కాలేదని ఆరా తీయడంతో విషయాన్ని వెంటనే వాసు దృష్టికి శ్రీనాథ్ తీసుకెళ్లాడు. దీంతో ఎంకే చౌదరికి వాసు ఫోన్ చేసి 'నువ్వు ఎవడివిరా నా మనిషిని బస్సులు ఫుల్ కాలేదని అడగటానికి' అంటూ గద్దించాడు. దీనికి దీటుగానే ఎంకే చౌదరి కూడా స్పందించాడు. ఫోన్‌లోనే ఇరువురి మధ్య మాటల యుద్ధం సాగింది. అనంతరం ఇద్దరూ ఛాలెంజ్‌లు విసురుకుని ఎవరికి వారు అనుచరులతో కలసి ప్రధాన రహదారిపై ఉన్న జీపు స్టాండ్ వద్దకు చేరుకుని గొడవకు దిగారు. పరిస్థితి విషమిస్తుండడంతో స్థానికులు జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో ఇరువర్గాల వారు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఇరువర్గాల అనుచరులు పెద్ద సంఖ్యలో పీఎస్ వద్ద గుమికూడడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వాసు తనను బెదిరించినట్లు ఎస్‌ఐ సురేష్‌కు ఎంకే చౌదరి ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు విచారణ చేపట్టారు.

జంట హత్యల కేసులో మరో ఇద్దరికి రిమాండ్

రాప్తాడు: మండలంలోని గంగలకుంట గ్రామ పొలంలో జరిగిన జంట హత్య కేసులో మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు ప్రత్యేక విచారణ అధికారి, అనంతపురం నాల్గో పట్టణ సీఐ ఎస్.జగదీష్ శుక్రవారం వెల్లడించారు. కాగా, ఈ ఏడాది మే 17న గంగలకుంట గ్రామ పొలంలో గొల్లపల్లికి చెందిన రైతు చిగిచెర్ల నారాయణరెడ్డి, ముత్యాలమ్మ దంపతులపై టీడీపీ కార్యకర్తలు వేట కొడవళ్లు, కట్టెలతో దాడి చేసి హతమార్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షి, హతుడు నారాయణరెడ్డి కుమారుడు చిగిచెర్ల ప్రదీప్ కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు రాప్తాడు పోలీసులు 11 మందిపై కేసు నమోదు చేశారు. మే 19న రాప్తాడుకు చెందిన పామల్ల ధనుంజయ, పామల్ల ఇంద్రశేఖర్, నీరుగంటి నిరంజన్ రెడ్డి, దండు నరేంద్ర, గంగలకుంటకు చెందిన బుడగ లక్ష్మీనారాయణ, అనంతపురం రూరల్ మండలం కందుకూరుకు చెందిన దయ్యం హనుమంతరెడ్డిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం పోట్లమర్రికి చెందిన బాలనరసింహారెడ్డి అదే నెల 21న కోర్టులో లొంగిపోయాడు. హత్య జరిగిన సమయంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిందితుడు పామాల్ల కొండప్ప అలియాస్ లక్షల కొండప్ప అదే నెల 23న డిశార్జ్ కాగానే పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. అజ్ఞాతంలో ఉన్న రాప్తాడుకు చెందిన పామాల్ల పండయ్య, గొనిపట్ల శీనా, పాత్రికేయుడు.. గొల్లపల్లికి చెందిన పెద్దింటి జగదీష్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 12న ప్రసన్నాయపల్లి సమీపంలోని హర్మోని సిటీ వద్ద తచ్చాడుతున్న పండయ్య, శీనాను గుర్తించి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న నిందితుడు పెద్దింటి జగదీష్‌ను త్వరలో అరెస్ట్ చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎలక్ట్రికల్, ల్యాండ్ సర్వేయర్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లు: పట్టణంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ) ట్రెనింగ్ సెంటర్‌లో ఎలక్ట్రికల్, ల్యాండ్ సర్వేయర్ శిక్షణకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.గోవిందరాజులు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తమ సెంటర్‌లో ఎలక్ట్రికల్ ల్యాబ్‌తో పాటు ల్యాండ్ సర్వేయర్ శిక్షణకు అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నిరుద్యోగులకు ఈ సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. శిక్షణ కాలపరిమితి 3 నెలలు ఉంటుందని, 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు గల యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా సెంటర్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్లేస్‌మెంట్ చూపిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు 70138 58450, 90328 98402 నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

గడువులోపు 'ఉద్యాన' లక్ష్యాలు పూర్తి చేయండి

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో ఉద్యాన పథకాల లక్ష్యాలను గడువు లోపు పూర్తి చేయాలని ఉద్యానశాఖ డీడీ ఉమాదేవి ఆదేశించారు. శుక్రవారం నగరంలోని ఉద్యానశాఖ కార్యాలయంలో హార్టికల్చర్ ఆఫీసర్స్ (హెచ్‌వో)తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవై, ఆయిల్‌ఫాం, బ్యాంబూమిషన్ కార్యక్రమాల కింద వివిధ పథకాల అమలుకు రూ.12.86 కోట్లు బడ్జెట్ కేటాయించారన్నారు. కొత్త తోటల విస్తరణ, పాత తోటల పునరుద్ధరణ, యాంత్రీకరణ, పోస్ట్ హార్వెస్టింగ్, ఫారంపాండ్లు, ప్యాక్‌హౌస్, పాలీహౌస్, కోల్డ్ రూం, కోల్డ్ స్టోరేజీ, సోలార్ డ్రయర్స్, రైపనింగ్ చాంబర్స్, ప్రొటెక్టెడ్ కల్టివేషన్ తదితర అన్ని రకాల పథకాల అమలుకు అవకాశం ఉందన్నారు. అన్నింటా రాయితీలు, ప్రోత్సాహకాలు ఉన్న విషయాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. ప్రధానంగా ప్యాక్ హౌస్‌లకు రూ.2 లక్షలు రాయితీ ఉంటుందన్నారు. వ్యక్తిగత ఫారంపాండ్లకు రూ.75 వేలు, కమ్యూనిటీ ఫారం పాండ్ల నిర్మాణానికి రూ.18 లక్షలు, సోలార్ కోల్డ్ రూంలకు రూ.4.38 లక్షలు, రైపనింగ్ ఛాంబర్స్‌కు రూ.21 లక్షలు, కోల్డ్‌రూంలకు రూ. 5.25 లక్షలు, సోలార్ డ్రయర్స్‌కు రూ.ఒక లక్ష ఇలా... రాయితీలు రైతులు సద్వినియోగం చేసుకునేలా, పూర్తిస్థాయి బడ్జెట్ ఖర్చు చేయడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. వెంటనే అర్హులైన రైతులను గుర్తించి సాధ్యమైనంత తొందరగా గ్రౌండ్ అయ్యేలా చూడాలని తెలిపారు. ఈ–క్రాప్ నమోదు తక్కువగా ఉన్నందున నెలాఖరులోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

15 నుంచి స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ

అనంతపురం అర్బన్: క్యూఆర్ కోడ్ కలిగిన 'స్మార్ట్ బియ్యం కార్డు'లను ఈ నెల 15 నుంచి పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. కార్డుల పంపిణీపై శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి వరకు రేషన్ తీసుకుంటున్న 6,57,828 మంది కార్డుదారులందరికీ మొదటి దశలో 'స్మార్ట్ బియ్యం కార్డులు' పంపిణీ చేయనున్నామన్నారు. ఈ ఏడాది జూలై 1 నుంచి ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత కలిగిన వారికి రెండో దశలో స్మార్ట్ కార్డులు జారీ చేస్తారన్నారు. స్మార్ట్ బియ్యం కార్డులను చౌక ధరల దుకాణాలకు మ్యాపింగ్ చేసి సచివాలయ ఉద్యోగుల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దనే అందజేస్తామన్నారు. పంపిణీ సమయంలో కార్డుదారుల నుంచి సచివాలయ ఉద్యోగులు బయోమెట్రిక్ ద్వారా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఏ చౌక దుకాణానికి సంబంధించిన కార్డును అదే దుకాణం నుంచి ద్వారా రేషన్ పొందాలన్నారు. పంపిణీ ప్రక్రియను తహసీల్దార్లు పర్యవేక్షించాలని, పౌర సరఫరాలు, రెవెన్యూ శాఖల అధికారుల ద్వారా సరైన పర్యవేక్షణ ఏర్పాటు చేసి సచివాలయ ఉద్యోగులకు డీలర్లు పూర్తి సహకారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పాలనలో 'కూటమి' సూపర్ ఫ్లాప్

- సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి



మాట్లాడుతున్న నారాయణస్వామి, నాయకులు

రాయదుర్గం టౌన్: 'సూపర్ సిక్స్.. సూపర్ హిట్' అంటూ ప్రజలను మోసం చేయడాన్ని మానుకోవాలని, వాస్తవానికి పాలన చేతకాక సూపర్‌గా ఫ్లాప్ అయ్యారనే విషయాన్ని కూటమి ప్రభుత్వ పెద్దలు గుర్తించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్యం నారాయణస్వామి, సహాయ కార్యదర్శి రాజారెడ్డి హితవు పలికారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ స్థానిక ఇన్‌చార్జ్ నాగార్జున, జిల్లా కార్యవర్గ సభ్యుడు సంజీవప్ప, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొట్రేష్‌తో కలసి శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు వందకు పైగా హామీలిచ్చి.. అన్నీ అమలు చేశామంటూ సభల్లో గొప్పలకు పోవడం సిగ్గు చేటన్నారు. ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతి హామీ ఏమైందని ప్రశ్నించారు. మహిళలకు ఆడబిడ్డ నిధి ఊసే మరిచారన్నారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను కూడా తామే ఇచ్చినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులు యూరియా కోసం గంటల తరబడి బారులు తీరుతూ అవస్థలు పడుతుంటే సూపర్ హిట్ సభలు పెట్టి ఏం సాధించారో చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడలేని విధంగా కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే కార్మికులకు 8 గంటలు ఉన్న సమయాన్ని 10 గంటలు పెంచడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిరుతల మల్లికార్జున, ఏఐఎస్ఎఫ్ కోశాధికారి ఆంజనేయులు, నరసింహులు, తిప్పేస్వామి, దుర్గప్ప, రవి, గంగాధర, నాగయ్య, కుమార్ తేజ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారుడికి బ్యాంక్ మేనేజర్ బురిడీ

- కంపెనీ ఖాతాకు కాకుండా తన చెల్లెలి ఖాతాకు నగదు బదిలీ
- నలుగురిపై కేసు నమోదు

అనంతపురం: బ్యాంక్ ద్వారా నగదు బదలాయింపునకు వచ్చిన ఖాతాదారుడిని మోసగించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ నిర్వాకం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం వెలుగుచూడడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు మేనేజర్‌తో పాటు అతని చెల్లెలు, మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... నార్పల మండలం వెంకటాంపల్లికి చెందిన అర్జున్.. 2024లో అనంతపురం పాతూరులోని ఓ కంపెనీ షోరూంలో బైక్ కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో బైక్ విలువ రూ.1.25 లక్షలను ఏక మొత్తంగా షోరూంలో చెల్లించేందుకు సిద్ధమయ్యాడు. దీనిపై మేనేజర్ మేఘనాథ్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ రూ. లక్ష లోపు మొత్తాన్ని షోరూంలో చెల్లించవచ్చునని, రూ.లక్ష దాటితే నెల్లూరులోని బ్రాంచ్ హెడ్ బ్యాంక్ ఖాతాలో జమ చేయాల్సి ఉంటుందని సూచించాడు. ఇందుకు సమ్మతించిన అర్జున్.. షోరూంలో పని చేస్తున్న రేవంత్ అనే వ్యక్తిని తోడుగా పిలుచుకెళ్లి అతని ద్వారా అనంతపురంలోని సుభాష్ రోడ్డులో ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు శాఖలో నగదును బదలాయించి, ద్విచక్ర వాహనాన్ని ఇంటికి తీసుకెళ్లాడు. అయితే కొన్ని రోజుల తర్వాత బైక్ మొత్తాన్ని చెల్లించలేదని, కంతుల రూపంలోనైనా చెల్లించాలంటూ టాటా కంపెనీ ప్రతినిధులు లీగల్ నోటీసు జారీ చేశారు. దీంతో బైక్ విలువ మొత్తాన్ని ఒకే దఫాగా తాను చెల్లించానంటూ బ్యాంక్‌లో నగదు బదలాయింపు సమయంలో ఇచ్చిన కౌంటర్ ఫాయిల్‌ను కంపెనీ ప్రతినిధులకు చూపడంతో వారు క్షుణ్ణంగా పరిశీలించారు. అయితే నగదు బదలాయించిన ఖాతా కంపెనీకి సంబంధించినది కాదని నిర్ధారణ కావడంతో అదే విషయాన్ని అర్జున్‌కు తెలిపారు. దీంతో అర్జున్ ఆరా తీయడంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ నరసింహులు చెల్లెలు ధరణికి సంబంధించిన ఖాతాకు నగదు బదిలీ అయినట్లుగా నిర్ధారించుకుని అనంతపురం నాల్గో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు షో రూం మేనేజర్ మేఘనాథ్, సిబ్బంది రేవంత్, బ్యాంక్ మేనేజర్ నరసింహులు, అతని చెల్లెలు ధరణిపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

ప్రమాదకరం.. విద్యార్థుల ప్రయాణం

శింగనమల: చిన్నపాటి వర్షం కురిస్తే చాలు శింగనమల మండలం తరిమెల – కల్లుమడి గ్రామాల మధ్య ఉన్న పులుసు వంక ఉధృతంగా ప్రవహిస్తూ ఉంటుంది. ఈ వంకపై బ్రిడ్జి ఎత్తు పెంచాలని పలుమార్లు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరిమెల, కల్లుమడి గ్రామాల మధ్య రాకపోకలు సాగించాలంటే ఈ మార్గం తప్ప మరొకటి లేదు. ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన వర్షానికి వంక బ్రిడ్జిపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. కొన్ని రోజులుగా విద్యార్థులు అతి కష్టంపై ప్రవాహాన్ని దాటుకుని పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బ్రిడ్జి ఎత్తు పెంచేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు భాస్కర్, రామాంజనేయులు కోరుతున్నారు.



పులుసు వంకను దాటుతున్న విద్యార్థులు

క్లుప్తంగా

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఆత్మకూరు: ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులు, మందులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ ఏఓ వాసుప్రకాష్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. దుకాణాల్లో ధరల పట్టిక ప్రదర్శించాలని, యూరియా పక్కదారి పడితే చర్యలు తప్పవన్నారు. రైతులు అడిగిన మందులను మాత్రమే విక్రయించాలని సూచించారు.

గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు



నూతన సభ్యులను సత్కరిస్తున్న గ్రంథాలయ అధికారులు

అనంతపురం కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కన్వీనర్‌గా డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులతో కూడిన అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. సామాజిక సేవా కార్యకర్త రవికాంత్ రమణ, అధ్యాపకులు డాక్టర్ బృంద, కవి, రచయిత శ్రీరాములు, విశ్రాంత డీఎస్పీ హరి, విశ్రాంత ఉపాధ్యాయులు రామరత్నం, టౌన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్ నూతన కమిటీలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని లైబ్రరీలన్నింటిని అభివృద్ధి బాటలో నడిపేందుకు మరికొంత మందిని తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సహ గ్రంథాలయాధికారి దాసరి గోవిందు, లైబ్రేరియన్లు ప్రతాప్‌రెడ్డి, రవికుమార్‌నాయుడు, జయరామ్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తాం



విద్యుత్ సమస్యలపై మాట్లాడుతున్న డీఈ రవిశంకర్

ఆత్మకూరు: గ్రామాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తామని డీఈ రవిశంకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని సిద్దరాంపురంలో విద్యుత్ సమస్యలపై ప్రజలతో చర్చించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆర్‌డీఎస్ పథకం కింద కొత్త విద్యుత్ లైన్లు, పోల్స్ మార్చి, 24 గంటలు త్రీఫేస్ విద్యుత్ ఉండేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ దాస్, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

రామగిరి: మండలంలోని నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో శు క్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేక రంగుల పూలతో అలంకరించారు. పూజల్లో ఉమ్మడి జిల్లా వాసులేకాక, కర్ణాటక వాసులు పాల్గొని, అమ్మవారి ఆశీర్వాదం పొందారు.

ఆర్డీటీ సేవలను అడ్డుకోవడం అన్యాయం

రాప్తాడు: ఆర్డీటీ సేవలను అడ్డుకోవడం అన్యాయమని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అన్నారు. శుక్రవారం ఆయన రాప్తాడులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఈ నెల 15న తలపెట్టిన ర్యాలీ కరపత్రాలు విడుదల చేశారు. హరి మాట్లాడుతూ ఆర్డీటీ పేద ప్రజల కోసం చేసిన సేవలు ఉమ్మడి జిల్లా ప్రజలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. ఆర్డీటీని పరిరక్షించుకునేందుకు ఎస్సీ, ఎస్టీ, అఖిలపక్ష కమిటీ పొలికేక ఆధ్వర్యంలో ఈ నెల 15న అనంతపురంలో ఆర్ట్స్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సేవ సమితి జిల్లా అధ్యక్షులు ధన, ఆర్డీటీ అఖిలపక్ష కమిటీ నాయకులు సుగమంచి శ్రీనివాసులు, నాగేంద్ర, లక్ష్మన్న, సాకే గోవర్దన్, కేశగాళ్ల ప్రసాద్, కదిరప్ప, నరసింహులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతారాయం

రాప్తాడు: మండల వ్యాప్తంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శివప్రసాద్ నాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హంపాపురం సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా అంతరాయం ఉంటుందన్నారు.

భారీ వర్షం.. రైతులకు నష్టం

- పొలాల్లోనే కుళ్లిపోయిన పంటలు
- కన్నెత్తిచూడని అధికారులు, ప్రజాప్రతినిధులు
- నష్ట పరిహారం ఇవ్వాలని రైతుల డిమాండ్

ఆత్మకూరు: ఇటీవల వారం రోజులుగా జడివాన కురుస్తోంది. మండల వ్యాప్తంగా ముందస్తుగా సాగు చేసిన పంటలు తొలగించి, నూర్పిడి చేయాలనుకుంటున్న సమయంలో భారీ వర్షాలు కురిశాయి. వేరుశనగ, టమాటా పంటలు అధికంగా వర్షాలకు దెబ్బతిని కుళ్లిపోయాయి. దీంతో కొన్ని పంటలు దెబ్బతినగా, మరికొన్ని చోట్ల పొలాల్లోనే పంట పూర్తిగా తడిచి, కుళ్లిపోతోంది. చేతికంది వచ్చిన సమయంలో పంటలు పూర్తిగా నష్టపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పెట్టుబడి కూడా కష్టమే..

వేరుశనగ కాయలతో పాటు మేత కూడా దక్కకుండా పోయిందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం రైతులు టమాటా పంట ఎక్కువగా సాగు చేశారు. వర్షాలకు చాలా చోట్ల పంట నీట మునిగి కాయలన్నీ కుళ్లిపోతున్నాయి. వర్షం దెబ్బతో కనీసం పెట్టిన పెట్టుబడి కూడా అందదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





పంపనూరు వద్ద వర్షానికి కుళ్లిపోయిన టమాటాలను చూపుతున్న రైతు మోహన్‌రెడ్డి, ఆత్మకూరు వద్ద వర్షానికి తడిసిన వేరుశనగ పంట

కన్నెత్తి చూడని అధికారులు,ప్రజాప్రతినిధులు :

మండల వ్యాప్తంగా వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నా కనీసం వ్యవసాయ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు కన్నెత్తిచూడలేదని రైతులు అంటున్నారు. పంట నష్టం అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక పంపితే కనీసం పరిహారమైనా అందుతుందనుకుంటే వ్యవసాయ సిబ్బంది ఇటువైపు చూడలేదని రైతులు అంటున్నారు. అధికారులు స్పందించి పంట నష్టపరిహారం వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



వై.కొత్తపల్లి వద్ద తొలగించిన వేరుశనగను పొలంలోనే ఉంచి టార్పాలిన్‌ను కప్పిన దృశ్యం

బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

అనంతపురం అర్బన్: ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేర్చాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌బాబు అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలను ఓటు బ్యాంక్‌కుగా వాడుకుంటున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలన్నారు. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. రాజధానిలో మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రి బాపూలే స్మృతివనం ఏర్పాటు చేయాలన్నారు. బీసీల కులగణన నిర్వహించి జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఓబీసీలకు సబ్‌ప్లాన్ కింద ప్రత్యేక బడ్జెట్ కేటాయించి నోడల్ ఏజెన్సీల ద్వారా అమలు చేయాలన్నారు. బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. అనంతరం డీఆర్‌ఓ ఎ.మలోలకు నాయకులు వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ నాగభూషణం, కార్యదర్శి సురేంద్రగౌడ్, వర్కింగ్ అధ్యక్షుడు బీసీఅనిల్, సహాయ కార్యదర్శి డీకే రామలింగం, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, యువజన విభాగం అధ్యక్షుడు మనోజ్‌కుమార్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కేశవ్‌కుమార్, నాయకులు భరత్ యాదవ్, గౌతమ్, కోటి రామాంజి, శివప్రసాద్, ఆచారి, శంకర్‌గౌడ్, శోభనాచారి, మల్లికార్జున గౌడ్, జయాచారి, చిట్టేకార శీను, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ఐఏబీ సమావేశం నిర్వహించాలి

అనంతపురం సెంట్రల్: జిల్లా సాగునీటి సలహా మండలి(ఐఏబీ) సమావేశం నిర్వహించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలో హెచ్చెల్సీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు రాకపోవడంతో జిల్లాలో 87 వేల హెక్టార్లలో పంటలు సాగు చేయకుండా బీళ్లుగా ఉన్నాయన్నారు. కర్ణాటకలో మంచి వర్షాలు రావడంతో తుంగభద్ర జలాశయం నిండడంతో సకాలంలో నీళ్లు వస్తాయని రైతులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. కానీ కూటమి ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా ఐఏబీ సమావేశం జరపకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. దీని వలన రైతులు ఈ ఏడాది వరినాట్లు వేసుకోవాలో లేదో అని దిక్కుతోచని పరిస్థితి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే ఐఏబీ సమావేశం నిర్వహించి మిడ్‌పెన్నార్ దక్షిణ, ఉత్తర కాలువల కింద ఉన్న ఆయకట్టుతో పాటు చెరువులకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు, పండ్లతోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాయుడు, రాజారామ్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు చెన్నారెడ్డి, వలీ, భాస్కర్‌రెడ్డి, పోతులయ్య, శ్రీనివాసులు, సాయికుమార్, లక్ష్మణ్ కుమార్, జయమ్మ, ఈరప్ప, వెంకటేష్, మల్లి తదితరులు పాల్గొన్నారు.



హెచ్చెల్సీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నేతలు

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: వేతన బకాయిలు, ఇతర సమస్యలు పరిష్కరించాలంటూ పౌర సరఫరాల సంస్థ ఎంఎల్ఎస్ పాయింట్లలో పనిచేస్తున్న హమాలీలు సంస్థ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్, మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, పౌర సరఫరాల హమాలీ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఆర్‌వీనాయుడు మాట్లాడారు. ఎంఎల్ఎస్ పాయింట్లలో పనిచేస్తున్న హమాలీలకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా రెండు నెలల వేతనం అందలేదన్నారు. 2021, 2023 దసరాకు ఇవ్వాల్సిన యూనిఫారం, కుట్టు కూళ్లు ఇప్పటికీ చెల్లించలేదన్నారు. ప్రస్తుత దసరాకు ఇవ్వాల్సిన స్వీటు, బోనస్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సంస్థ డీఎం రమేష్‌రెడ్డికి నాయకులు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు హరి, నాయకులు ఈశ్వర్, శివ, శంకర్, అక్కులప్ప, సూరి, హనుమంతు, గోవిందు, నాగరాజు, హమాలీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం గౌరవాధ్యక్షుడు ఆర్‌వీనాయుడు

స్టాఫ్‌నర్సులకు డ్రెస్సింగ్ రూంలు ఇవ్వకపోతే ఎలా?

అనంతపురం మెడికల్: స్టాఫ్‌నర్సులకు బాత్‌రూం, డ్రెస్సింగ్ రూంలు ఇవ్వకపోతే ఎలా అని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని స్టాఫ్‌నర్సులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఏపీ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షురాలు రాధమ్మ, కార్యదర్శి కోటమ్మ నర్సుల సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ, కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు మాట్లాడుతూ ఆస్పత్రిలోని చాలా వార్డుల్లో స్టాఫ్‌నర్సులకు బాత్‌రూంలు లేవని, వార్డుల్లో డ్రెస్ మార్చుకోవాలన్నా కర్టన్లు, అల్మారాలు అడ్డం పెట్టుకునే దయనీయమైన పరిస్థితి నెలకొందన్నారు. కొన్ని వార్డుల్లో గదులున్నా..పీజీ సీట్ల పేరుతో ఖాళీగా ఉంచారు కానీ తమకు ఇవ్వలేదన్నారు. సీనియారిటీ ప్రాతిపదికన స్టాఫ్‌నర్సులు, హెడ్‌నర్సులకు పదోన్నతులు కల్పించాలన్నారు. కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులకు వేతనాలు పెంచడంతో పాటు రెగ్యులరైజేషన్ చేయాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు రాధమ్మ మాట్లాడుతూ స్టాఫ్‌నర్సుల పదోన్నతులు, సిబ్బంది కొరత, తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి, స్టాఫ్‌నర్సు అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్‌బీ పద్మ, నాయకులు నారాయణస్వామి, ఆదిత్య, లత, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్టాఫ్‌నర్సుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు రాధమ్మ

అర్చకుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం కల్చరల్: అర్చకుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా అర్చక సమాఖ్య నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం జిల్లా ఎండోమెంటు ఏసీ తిరుమలరెడ్డికి వినతిపత్రమందించారు. ఈసందర్భంగా సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో అర్చకుల డెత్ గ్రాడ్యుటీ ఫైల్స్ కదలడం లేదన్నారు. ధూపదీపనైవేద్య పథకాలు చాలా ఆలయాలకు వర్తింపజేయడం లేదని, ముఖ్యంగా అర్చకుల ఐడెంటిటీ కార్డుల మంజూరులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. అర్చకుల సమస్యలపై చర్చించేందుకు స్థానిక మొదటిరోడ్డు శివాలయంలో ఈనెల 17న ఉదయం సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అర్చకులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అర్చక సమాఖ్య ఉపాధ్యక్షులు వెంకటగిరి, ముచ్చుకోట ప్రసాద్, నవీన్, విజయ్‌కుమార్, తిరుపతయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సహాయ కమిషనర్‌కు వినతిపత్రమందిస్తున్న అర్చక సమాఖ్య నాయకులు

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

రామగిరి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం తూతూమంత్రంగా నిర్వహించారు. మండలంలో పదిమంది ఎంపీటీసీలు ఉండగా, గతేడాది డిసెంబర్‌లో అప్పటి ఎంపీపీ మీనుగ నాగమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి నాలుమార్లు ఎంపీపీ ఉప ఎన్నిక వాయిదా పడుతూ వస్తోంది. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు పదిమందిలో తొమ్మిది మంది గెలవగా, టీడీపీ మద్దతుదారులు ఒక్కరు గెలిచారు. అనంతరం జరిగిన పరిణామాల్లో ఇద్దరు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను టీడీపీలోకి చేర్చుకోగా, ఆరుగురు వైఎస్సార్‌సీపీ తరఫున ఉన్నారు. గతవారంలో జరగాల్సిన మండల సమావేశానికి ఒక్కరు మాత్ర మే హాజరుకాగా, శుక్రవారం జరిగిన సమావేశానికి ముగ్గురు సభ్యులు మాత్రమే హాజరయ్యారు. మండల సర్వసభ్య సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాల్సి ఉంది. అధికారులు ముగ్గురితోనే సమావేశం ముగించారు.



మండల సర్వసభ్య సమావేశ దృశ్యం

సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు చెల్లించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు చెల్లించాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. తిమ్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీఆర్టీయూ సీనియర్ నాయకులు రామమూర్తి, పి. హనుమంతరెడ్డి తదితర నాయకులతో కలిసి శుక్రవారం అనంతపురం రూరల్ మండలంలో సంఘం సభ్యత్వ నమోదు, సమస్యల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తిమ్మారెడ్డి మాట్లాడుతూ ఇంగ్లిష్, సోషల్ స్టడీస్‌లలో సిలబస్ భారాన్ని తగ్గించాలన్నారు. దసరా సెలవులు సెప్టెంబరు 21 నుంచి అక్టోబర్ 3 వరకు ప్రకటించాలని డిమాండ్ చేశారు. సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సీసీఎల్ ఇవ్వాలని, 12వ వేతన సవరణ కమిషన్ నియామకాన్ని చేపట్టి తక్షణమే 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఆర్టీయూ అనంతపురం రూరల్ మండల సీనియర్ నాయకులు ఎ. వెంకటనారాయణరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.



సభ్యత్వం, సమస్యల సేకరణలో పాల్గొన్న పీఆర్టీయూ నాయకులు

ఏచూరి ఆశయ సాధనకు కృషి

అనంతపురం అర్బన్: 'మతోన్మాదం నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే సీతారాం ఏచూరికి నిజమైన నివాళులు అర్పించడం. ఆయన ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి' అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప పిలుపునిచ్చారు. సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఏచూరి ప్రథమ వర్ధంతి సభను శుక్రవారం స్థానిక క్లాక్‌టవర్ వద్ద నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నల్లప్ప, డాక్టర్ వీరభద్రయ్య మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యంతో పాటు విదేశాంగ విధానం, లౌకిక వాదం, ఫెడరలిజంకు మతోన్మాదం నుంచి వస్తున్న ప్రమాదాన్ని ఎదుర్కోవడమే సీతారాం ఏచూరికి నిజమైన నివాళి అన్నారు. సోషలిజం ఎప్పుడూ వెనక్కు వెళ్లదని ఆయన చెప్పేవారన్నారు. భారత రాజకీయాల్లో పెనుమార్పులు వస్తున్న ప్రస్తుత తరుణంలో అభ్యుదయ, లౌకిక, ప్రజాస్వామ్య శక్తుల పాత్రను ముందుకు తీసుకెళ్లడంలో ఏచూరి లేని లోటు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చంద్రశేఖర్, ఆర్‌వీనాయుడు, నాయకులు ముర్తుజా, ఇర్ఫాన్, లక్ష్మినారాయణ, లక్ష్మినరసమ్మ, ఎర్రిస్వామి, రాజు, శీనా, శివారెడ్డి, బీహెచ్‌రాయుడు, సంజీవరెడ్డి, ఆజాం, ఆది, రామాంజనేయులు, నాగరాజు, జ్యోతి, కవిత, తదితరులు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సీతారాం ఏచూరి ఆదర్శ కమ్యూనిస్టు

రాప్తాడు: సీతారాం ఏచూరి ఆదర్శ కమ్యూనిస్ట్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాల రంగయ్య, రాప్తాడు ప్రాంతీయ కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. మండల కేంద్రంలో సీతారాం ఏచూరి మొదటి వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఎం నాయకులు జరుపుకున్నారు. నాయకులు మాట్లాడుతూ తుది శ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేసిన గొప్ప నేత సీతారాం ఏచూరి అని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం శాఖ కార్యదర్శులు మల్లేష్, మధు, సభ్యులు లక్ష్మన్న, ప్రతాప్, సుబ్బారావు, నారాయణస్వామి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తోపుదుర్తి ఇంట విషాదం



తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎంపీ తలారి రంగయ్య తదితరులు



తోపుదుర్తి కవితను ఓదారుస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తోపుదుర్తి కవిత ఇంట విషాదం చోటు చేసుకుంది. ఆమె భర్త, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి శుక్రవారం గుండెపోటుతో ఆకస్మిక మరణం చెందారు. అనంతపురంలోని నివాసంలో భాస్కర్‌రెడ్డి మృతదేహాన్ని పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు. తోపుదుర్తి కవితను ఓదార్చి.. ధైర్యం చెప్పారు.

యూరియా పంపిణీలో నిర్లక్ష్యం చేయొద్దు



యూరియా కోసం వేచి ఉన్న రైతులు

రాప్తాడు: రైతులకు యూరియా పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఏఓ క్రిష్ణ చైతన్య సూచించారు. శుక్రవారం ఆయన ప్రసన్నాయపల్లి రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం యూరియా కోసం వచ్చిన రైతులతో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం మండంలో ప్రసన్నాయపల్లి రైతు సేవా కేంద్రానికి 180 బ్యాగుల యూరియా వచ్చిందన్నారు. దాదాపుగా 180 బ్యాగులు యూరియా, డీఏపీ 80 బ్యాగులు రైతులకు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ సుజిత, వీఏఏ సోనియా, భారతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

22 నుంచే స్కూళ్లకు సెలవులివ్వాలి

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర విద్యా క్యాలెండర్ ప్రకారం దసరా సెలవులు ఈనెల 24 నుంచి ఇస్తున్నారు. కానీ పండుగ 22న ప్రారంభమవుతున్న నేపథ్యంలో అదేరోజు నుంచే సెలవులు ఇవ్వాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుజ్జల శివయ్య, డెగావత్ రవీంద్రనాథ్ డిమాండ్‌చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. దసరా వేడుకలు, దేవీ నవరాత్రులు, బతుకమ్మ ఉత్సవాలు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ ఏడాది పర్వదినం అక్టోబర్ 2న వచ్చిందని, నవరాత్రులు 22 నుంచి మొదలై అక్టోబర్ 2న విజయదశమితో ముగుస్తాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆ రోజు నుంచే స్కూళ్లకు సెలవులు ప్రకటించాలని కోరారు.

భాస్కరరెడ్డి మరణం బాధాకరం

అనంతపురం కల్చరల్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తోపుదుర్తి భాస్కరరెడ్డి మరణం బాధాకరమని సీనియర్ రంగస్థల నటుడు సంగాల నారాయణస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. దశాబ్దాలుగా భాస్కరరెడ్డి తండ్రి రామచంద్రారెడ్డితోతో కలిసి అనేక ప్రజాహిత కార్యక్రమాల్లో పాల్గొన్నామని గుర్తు చేసుకున్నారు. నిత్యం ప్రజల కోసం ఆలోచించే నాయకుడు వెళ్లిపోవడం విచారకరమని ఆవేదనను వ్యక్తం చేశారు. ఆయన ఆశయాలను యువతరం పాటించాలని కోరారు.

అరుదైన శస్త్రచికిత్స

అనంతపురం మెడికల్: నగరంలోని కిమ్స్–సవీర ఆస్పత్రిలో ఓ మహిళకు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు వైద్యులు. అందుకు సంబంధించి ఆస్పత్రి నిర్వాహకులు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. తాడిపత్రికి చెందిన ఓ 38 ఏళ్ల మహిళకు థైరాయిడ్ కేన్సర్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఈఎన్‌టీ కన్సల్టెంట్ డాక్టర్ హరీష్‌కుమార్ మహిళకు సర్జరీని విజయవంతంగా చేశారు.

క్వాంటం కంప్యూటింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

అనంతపురం: అమరావతి క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీ హాకథాన్–2025 సెమీ ఫైనల్ పోటీల్లో సత్తా చాటిన ఎస్కేయూ, జేఎన్‌టీయూ అనంతపురం విద్యార్థులను వేర్వేరుగా అభినందించారు. ఎస్కేయూలో ఇంచార్జి వీసీ ప్రొఫెసర్ బి. అనిత క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులను సత్కరించారు. అలాగే జేఎన్‌టీయూ అనంతపురం విద్యార్థులను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్య అభినందించారు. అమరావతిలో నిర్వహించే ఫైనల్ పోటీల్లోనూ సత్తా చాటాలని కోరారు.

నేటి నుంచి రాష్ట్ర మహాసభలు

అనంతపురం అర్బన్: స్థానిక గణేనాయక్ భవన్‌లో శని, ఆదివారం మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి దాయా రమాదేవి తెలిపారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆమె సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణితో కలిసి విలేకరులతో మాట్లాడారు. పథకంలో పనిచేస్తున్న కార్మికులను స్కీమ్ వర్కర్లుగా గుర్తించాలనే డిమాండ్‌ను ప్రభుత్వం పెడచెవిన పెడుతోందన్నారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్‌చార్జీలు పెంచాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులు ఉపాధి భద్రత కల్పించాలని, వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. రాష్ట్ర మహాసభలకు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మాలిని మెస్కా ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. సభలకు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని కోరారు. సమావేశంలో ఆటో కార్మిక సంఘం మహిళ విభాగం అధ్యక్షురాలు స్వాతి పాల్గొన్నారు.